సాక్షి
అనంతపురం
మంగళవారం । 10 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టంగా రూ.3, సరాసరి రూ.5.50 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.9°/08.4°

అనంతపురం జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుదలగా నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

మహిళల హాకీ జట్టు ఎంపిక
అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పాల్గొనే జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టును సోమవారం ఎంపిక చేశారు. అనంత క్రీడాగ్రామం వేదికగా సాగిన ఈ ప్రక్రియకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో రోషిత, మల్లీశ్వరి, షాహీన్, రాధిక, నూర్జహన్, శ్రావణి, మీనేటీ, మమత, జ్యోతి, ఎం శ్రావణి, పావని, మాధవి, దీపిక, ఆశ ఉన్నారు.

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక
కళ్యాణదుర్గం: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక ప్రక్రియ సోమవారం ముగిసింది. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానం వేదికగా రెండు రోజుల పాటు సాగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 12 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. అండర్–19 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర జట్టులో 20 మంది, బాలికల జట్టులో 20 మంది చొప్పున చోటు దక్కించుకున్నారు. బాలుర జట్టుకు పీడీలు వీరేష్, వి.మురళి, జి.సురేష్, బాలికల జట్టుకు పీడీలు శివకేశవుడు, నాగమణి, శ్రీధర్‌రెడ్డి సెలెక్టర్లుగా వ్యవహరించారు.

కొంపముంచిన ఆశ
- రూ.30 లక్షలు మోసపోయిన యువకుడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పెట్టుబడికి రెండింతల రాబడి అంటూ సామాజిక మాధ్యమం టెలిగ్రాంలో వచ్చిన 'ఆఫర్'ను నమ్మి ఓ యువకుడు నయవంచనకు గురయ్యాడు. రూ.30 లక్షల దాకా పెట్టుబడి రూపంలో పెట్టి మోసపోయాడు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగు చూసింది. అనంతపురంలోని కోవూరు నగర్‌లో నివాసముంటున్న ఎరుకల రాజశేఖర్ ఇటీవల స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న టెలిగ్రామ్ యాప్‌లో ఓ ప్రకటన చూశాడు. ఇంటి వద్దే ఉండి రోజుకు రూ.1000 నుంచి రూ.1,500 వరకు సంపాదించవచ్చు అని ఉండటంతో ఆసక్తి చూపాడు. ఆ యాప్ సూచనలను అనుసరించాడు. సినిమాలకు రేటింగ్ ఇవ్వాలని, ఇందుకు గాను డ్రాఫ్ట్ హౌస్ వెబ్‌సైట్ తెరవాలని సూచించడంతో ఆ విధంగానే చేశాడు. కమీషన్ కోసం ఎదురు చూశాడు. ఇతని ఫోన్ నంబర్ ద్వారా ఒక ఐడీ (107902) సృష్టించారు. ఈ ఐడీతో 30 పనులు పూర్తి చేసిన అనంతరం రాజశేఖర్‌కు రూ.850 కమీషన్ వచ్చింది. అనంతరం డిపాజిట్‌లు చేయాలని చెప్పడంతో ఈ నెల మూడో తేదీ నుంచి పలు దఫాలుగా యాప్ నిర్వాహకులు చెప్పిన ఐదు ఖాతాలకు మొత్తం రూ.29.80 లక్షలు బదిలీ చేశాడు. అనంతరం యాప్‌లో ఎవరూ అందుబాటులోకి రాలేదు. తాను మోసపోయానని గ్రహించిన రాజశేఖర్ ఈ నెల ఎనిమిదో తేదీన నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ జాకీర్‌హుస్సేన్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు.

శాశ్వత పరిష్కారం చూపాలి
అనంతపురం అర్బన్: ప్రజలు తమ సమస్యలపై 'స్పందన'లో ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో డీఆర్వో గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి జేసీ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 424 వినతులు అందాయి. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.

ప్రతిపాదనలు త్వరగా పంపండి

కారుణ్య నియామకాలకు అన్ని శాఖలు త్వరగా ప్రతిపాదనలు పంపించాలని జేసీ కేతన్‌గార్గ్ జిల్లా అధికారులను ఆదేశించారు. కారుణ్య నియామకాల అంశంపై జేసీ రెవెన్యూ భవన్‌లో అధికారులతో సమీక్షించారు. సచివాలయాల్లో కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

మల్బరీ.. లాభాల ఝరి



మల్బరీ తోట

- మల్బరీ రైతులకు సర్కారు చేయూత
- పుల్ల నుంచి పట్టుగూళ్లు అమ్ముకునే దాకా ప్రోత్సాహం
- అందులో ఎస్సీ. ఎస్టీ రైతులకు మరింతగా వెన్నుదన్ను
- ఉపాధి హామీ పథకం వర్తింపుతో రైతులకు ఉపశమనం

మల్బరీ సాగు రైతుకు లాభదాయకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా చేయూతనిస్తోంది. పట్టు పరిశ్రమ ద్వారా పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. మల్బరీ పుల్ల నాటుకునే దశ నుంచి మార్కెట్‌లో పట్టుగూళ్లు అమ్ముకునే దాకా అండగా నిలుస్తుండటంతో రైతులు పురోగతి సాధిస్తున్నారు.

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మల్బరీ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం బాగుండటంతో ఎక్కువమంది మల్బరీ సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా గతేడాది మార్చి 4న పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా అవతరించింది. పట్టు పరిశ్రమశాఖ ప్రధాన కార్యాలయం పుట్టపర్తికి తరలించారు. అనంతపురానికి ఏడీ స్థాయి అధికారిని జిల్లా సెరికల్చర్ అధికారి (డీఎస్‌వో)గా నియమించారు. అనంతపురం జిల్లాలో మూడు వేల హెక్టార్ల వరకు మల్బరీ సాగులో ఉండగా.. శ్రీసత్యసాయి జిల్లాలో 25 వేల హెక్టార్లకు పైగా సాగులో ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఏటా 30 వేల మెట్రిక్ టన్నులు పట్టుగూళ్ల ఉత్పత్తితో రూ.500 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అనంతపురం జిల్లాలో పట్టుకు పూర్వవైభవం తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రోత్సాహకాలతో విస్తీర్ణం పెంపు

మల్బరీ సాగు చేసే రైతులను మరింతగా ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో రాయితీలు పెంచింది. అందులోనూ ఎస్సీ, ఎస్టీ రైతులకు మరింత ఎక్కువగా వర్తింపజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూడా అనుసంధానించడంతో మల్బరీ రైతులకు మరింత ప్రయోజనాలు కలగనున్నాయి. ప్లాంటేషన్ నుంచి పట్టుగూళ్లు అమ్మేవరకు వివిధ దశల్లో వివిధ రకాలుగా ప్రయోజనాలు ఉండటంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. అన్నింటికీ మించి మార్కెట్‌లో పట్టుగూళ్లకు మంచి ధరలు పలుకుతుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పట్టు పురుగుల పెంపకం



పట్టుగూళ్లు శుభ్రం చేస్తున్న కూలీలు

మల్బరీ రైతులకు ప్రోత్సాహకాలు

విభాగం	జనరల్ కేటగిరీ	ఎస్సీ, ఎస్టీలకు
పుల్ల నాటుకునేందుకు (ఎకరాకు)	రూ.18,750	రూ.22,500
పంట పెంపకానికి పెద్దసైజు షెడ్డు	రూ.3 లక్షలు	రూ.3.60 లక్షలు
చిన్న సైజు షెడ్డు నిర్మాణానికి	రూ.2.25 లక్షలు	రూ.2.70 లక్షలు
సూట్ రైటింగ్ (పెద్దషెడ్డుకు)	రూ.56,250	రూ.67,500
సూట్‌రైటింగ్ (చిన్నషెడ్డుకు)	రూ.37,500	రూ.45 వేలు
షెడ్డు పరిశుభ్రతకు	రూ.3,750	రూ.4 వేలు
యాంత్రీకరణకు	రూ.5 వేలు	రూ.5 వేలు
సేంద్రియ పోషకాలు	రూ.5 వేలు	రూ.5 వేలు
బైవోల్టిన్ చాకీ చార్జీలు	రూ.1,000	రూ.1,800
కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ఇన్సెంటివ్	రూ.50	రూ.50

'ఉపాధి' కింద మొక్కల పెంపకానికి..

ట్రీ ప్లాంటేషన్ (మూడేళ్లలో)	రూ.1,52,805	రూ.1,52,805
పెద్ద షెడ్డు నిర్మాణానికి	రూ.9,59,900	రూ.10,20,000
చిన్నషెడ్డు నిర్మాణానికి	రూ.6,80,400	రూ.7,25,400

ప్రణాళిక రూపొందించాం



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాయితీల ద్వారా జిల్లాలో మల్బరీ విస్తీర్ణం పెంచడానికి ప్రణాళిక రూపొందించాం. కళ్యాణదుర్గం డివిజన్‌లో పరిస్థితి బాగుంది. రాప్తాడు, అనంతపురం, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి ప్రాంతాల్లో రైతులను ప్రోత్సహిస్తాం. మార్కెట్‌లో ధరలు స్థిరంగా కొనసాగనున్నాయి,. భూగర్భజలాలు పెరగడంతో రైతులు కూడా ముందుకు వస్తే రాయితీలు, ఇన్సెంటివ్‌లు అందజేస్తాం. నెలనెలా అంతో ఇంతో డబ్బులు వచ్చే మల్బరీకి మించిన ఆదాయపు పంట మరొకటి లేదు.

– డి.ఆంజనేయులు, జిల్లా పట్టుశాఖ అధికారి

రేషం ఆదుకుంటోంది



నాకు 13 ఎకరాల పొలం ఉంది. రెండు ఎకరాల్లో సాగు చేసిన మల్బరీ పంట ఆదుకుంటోంది. వర్షాలు ఎక్కువై ఈసారి వేరుశనగ ఇతర పంటలు దెబ్బతిన్నాయి. అయితే విడతకు 300 మట్టి చొప్పున ఏడాది ఐదు పంటలు రేషం పండిస్తున్నాం. మార్కెట్‌లో ధరలు బాగానే ఉన్నందున ఐదు పంటల కింద రూ.5 లక్షలకు పైగా తీసుకున్నా. షెడ్డుకు రూ.1.80 లక్షలు, కార్పొరేషన్ ద్వారా మరో రూ.లక్ష, స్టాండ్స్‌కు రూ.45 వేలు ఇలా... రేషం పంటకు ఉపయోగపడే వాటికి ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇపుడున్న పరిస్థితుల్లో మల్బరీ పంట రైతులకు లాభదాయకంగా ఉంది.

– తిరుపాల్‌నాయక్, ఎస్టీ రైతు, వేపచెర్ల దిగువతండా, ఆత్మకూరు మండలం

జిల్లాకు చేరిన ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: వివిధ కంపెనీల నుంచి 8,367 మెట్రిక్ టన్నుల ఎరువులు సోమవారం జిల్లాకు చేరాయి. రైల్వే వ్యాగన్ల ద్వారా ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు చేరిన ఎరువులను ఫర్టిలైజర్స్ రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.వెంకటరాముడు, రాప్తాడు ఏఓ శుభకర్ పరిశీలించి అన్‌లోడ్ చేయించారు. రబీ ఎరువుల నెలవారీ ప్రణాళికలో కోటా మేరకు కోరమాండల్ కంపెనీ (సీఐఎల్)కు చెందిన 2,073 మెట్రిక్ టన్నుల యూరియా, పారాదీప్ పాస్ఫేట్ లిమిటెడ్ (పీపీఎల్) నుంచి 657 మెట్రిక్ టన్నుల 20–20–0–13 రకం కాంప్లెక్స్, 724 మెట్రిక్ టన్నుల డీఏపీ వచ్చిందన్నారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) నుంచి 1,114 మెట్రిక్ టన్నుల ఎంవోపీ (రెడ్ పొటాష్), 159 మెట్రిక్ టన్నుల 16–16–16 రకం కాంప్లెక్స్, ఇఫ్కో కంపెనీ నుంచి 524 మెట్రిక్ టన్నుల డీఏపీ, 503 మెట్రిక్ టన్నుల 20–20–0–13 రకం, 2,613 మెట్రిక్ టన్నుల 10–26–26 రకం కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయని వివరించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఏఓ బి.చంద్రానాయక్ ఆదేశాల మేరకు మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయడంతో పాటు మిగతాది మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాములకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం



ఓటును అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలను సందర్శించి, ఓటు అభ్యర్థించారు. తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు కొండారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ వన్నప్ప, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి జిల్లా బహిష్కరణ



అగ్నిగుడ్డం యువరాజు



డ్రిప్ నాగరాజు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇద్దరిపై నాలుగు నెలల పాటు జిల్లా బహిష్కరణ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బొమ్మనహాళ్ మండలం బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన అగ్నిగుడ్డం యువరాజు, బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన నాగరాజు పలు కేసుల్లో నిందితులు. వీరిలో యువరాజుపై ఆంధ్రప్రదేశ్ సామాజిక వ్యతిరేక, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం–1980 కింద జిల్లా బహిష్కరణ నోటీసులు జారీ చేశారు. ఇదివరకే బొమ్మనహాళ్ పోలీసు స్టేషన్ లో 12 కేసుల్లో ఇతను నిందితుడిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాగరాజుకు కూడా పై చట్టం కిందే జిల్లా బహిష్కరణ నోటీసులు జారీ చేశారు. ఇతనిపైనా కళ్యాణదుర్గం రూరల్ పోలీసు స్టేషన్లో ఒకటి...బెళుగుప్ప పోలీసు స్టేషన్‌లో ఏడు కేసులు నమోదయ్యాయి.

సంపాదన కోసం అడ్డదారులు..

అగ్నిగుడ్డం యువరాజు, నాగరాజు డబ్బు సంపాదనకు అక్రమ మార్గం ఎంచుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నాన్–డ్యూటీ పెయిడ్ మద్యాన్ని అక్రమంగా జిల్లాకు తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చినా వీరి పద్ధతిలో మార్పు కనిపించలేదు. సంబంధిత పోలీసు స్టేషన్లలో వీరిపై సస్పెక్ట్ షీట్‌లను ఓపెన్ చేసి వారి కదలికలపై నిఘా ఉంచినా ఫలితం లేకపోయింది. సత్ప్రవర్తన తీసుకురావాలని పోలీసులు బైండోవర్ చేసినప్పటికీ పద్ధతి మాత్రం మార్చుకోలేదు. ప్రజారోగ్యంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న వీరిపై జిల్లా బహిష్కరణ నోటీసులు జారీ చేశారు.

విద్యార్థులను దీటుగా తీర్చిదిద్దండి

- సృజనాత్మక బోధనతోనే సులువుగా అభ్యసనం
- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



ఎస్కేయూలో అధ్యాపకుల శిక్షణను ప్రారంభిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

అనంతపురం: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో '21 వ శతాబ్దపు నైపుణ్యాలు, బోధన పద్ధతులు' అనే అంశంపై అధ్యాపకులకు నాలుగు రోజుల శిక్షణను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథి హేమచంద్రారెడ్డి మాట్లాడారు. పారిశ్రామిక విప్లవం 4.0కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. ఉన్నత విద్యలో ప్రమాణాల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా ఖర్చు చేస్తోందన్నారు. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఏటా రూ.20 వేలు జగనన్న వసతి దీవెన కింద విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక స్కిల్ కళాశాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తున్నామన్నారు. సంప్రదాయ విధానంలో డిగ్రీ చదివే విధానానికి స్వస్తిపలికి డిగ్రీ ఆనర్స్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్‌ను తప్పనిసరి చేశామన్నారు. పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందిస్తేనే కొలువులు దక్కుతాయన్నారు. కళాశాల నుంచే కంపెనీ కొలువులు దక్కేలా నూతన విద్యాప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి, రిసోర్స్‌పర్సన్ ఎస్.దినకర్‌రెడ్డి, రెక్టార్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, కోఆర్డినేటర్లు ఎల్.శివశంకర్‌రెడ్డి, డి.చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో నైపుణ్యాల మెరుగు

అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అకాడమీ సహకారంతో అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేయడం ద్వారా వారిలో ఉద్యోగ నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, సదస్సు సమన్వయకర్త డాక్టర్ ఎ.శేషారెడ్డి, కామర్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకుబాట.. భవిత రాత

పుట్టే ప్రతి బిడ్డా చేతులు బిగబట్టే పుడుతుంది
ఆ చేతుల్లో పుస్తకం పెడితే తలరాతనే మార్చుకుంటుంది
విధిరాతకు తలొగ్గితే.. అలాగే మిగిలిపోతుంది



ఈ చిత్రం ఓ ఆదర్శమూర్తి పట్టుదలకు, ఓ చిన్నారి సంకల్పానికి అద్దం పడుతోంది. అనంతపురం శివారులోని బీజేపీ కొట్టాలకు చెందిన మారెమ్మ రోజా తడకలేరు సమీపంలోని ఫుట్‌పాత్‌పై పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. తన ఒక్కగానొక్క బిడ్డ తనలా ఉండిపోకూడదని అనంతపురం పాతూరు ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదివిస్తోంది. చిన్నారి కూడా బడి వదలగానే తల్లి వద్దకు వచ్చి ఫుట్‌పాత్‌పైనే హోం వర్క్‌లు చేసుకుంటోంది. రోడ్డు పక్కనే ఎదుగుతున్న చదువుల మొక్కను. ఆ మొక్కకు తీగలా మారిన తల్లి చెట్టునూ చూసి వాహనదారులు సలామ్ చేస్తున్నారు.

- జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్

'చలి'గింతలు

అనంతపురం అగ్రికల్చర్: శీతాకాలంలో తొలిసారి ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయిలో నమోదవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు గజగజ వణుకుతున్నారు. రాత్రిళ్లు సాధారణం కన్నా రెండు డిగ్రీలు తగ్గిపోవడంతో చలితీవ్రత బాగా పెరిగింది. సోమవారం వేకువజామున పొగమంచుతో పాటు చలి ఎక్కువైంది. మధ్యాహ్నం 12 గంటల వరకు చలితీవ్రత కొనసాగింది. అనంతపురం జిల్లా బెళుగుప్పలో 8.4 డిగ్రీలు, శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 8.7 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక శెట్టూరు 8.8, తనకల్లు 9, నల్లచెరువు 9.3, గుమ్మఘట్ట, సోమందేపల్లి 9.6, గాండ్లపెంట, కంబదూరు, అమడగూరు 9.7, అగళి 9.8, పుట్లూరు, ఉరవకొండ 9.9 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. శింగనమల, యల్లనూరు, పెద్దవడుగూరు, పామిడి, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల, గుత్తి, గుంతకల్లు, విడపనకల్లు, వజ్రకరూరు, ఆత్మకూరు, కూడేరు, యాడికి, ఓడీ చెరువు, రొద్దం, రామగిరి, తాడిమర్రి తదితర మండలాల్లో కూడా ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడటం, కోటా మేరకు హెచ్చెల్సీ, హంద్రీ–నీవా నీళ్లు రావడంతో జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, చెరువులన్నీ జలకళను సంతరించుకోవడంతో చలి వాతావరణం పెరిగిందని నిపుణులు చెబుతున్నారు.

ఎర్రచందనం దుంగల పట్టివేత

- విలువ రూ.కోటిపైనే ఉండొచ్చని అంచనా!



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, వాహనం

పెద్దవడుగూరు: వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కాశేపల్లి టోల్‌గేట్ సమీపంలో సోమవారం రాత్రి ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. టోల్‌గేట్ సమీపంలో ఏపీ09 వై 7749 నంబర్ గల ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మొక్కజొన్న విత్తనాలు, పొట్టు బస్తాల కింద ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వెంటనే వాహనాన్ని పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వీఎన్‌కే చైతన్య స్టేషన్‌కు చేరుకున్నారు. ఎర్రచందనం దుంగల గురించి మీడియాకు ఎటువంటి సమాచారమూ వెల్లడించలేదు. స్వాధీనం చేసుకున్న 43 ఎర్రచందనం దుంగల విలువ రూ.కోటి పైనే ఉంటుందని అంచనా. ఐచర్ వాహనాన్ని సీజ్ చేసి, వాటిని తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మహిళా సంఘాల్లో గోల్‌మాల్

- టీడీపీ హయాంలో నియమించిన యానిమేటర్ల చేతివాటం
- రూ.30లక్షల స్త్రీనిధి, బ్యాంకు రుణాల స్వాహా!
- అక్రమాల్లో సీసీల భాగస్వామ్యం
- 'స్పందన'లో ఫిర్యాదుతో కదిలిన డొంక


ఉరవకొండలోని మండల సమాఖ్య కార్యాలయం


తమ రుణాలు స్వాహా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్న బాబా సంఘం సభ్యురాలు లక్ష్మీదేవి

ఉరవకొండ: ఉరవకొండ మండల సమాఖ్యలో అక్రమాలు వెలుగు చూశాయి. రూ.30 లక్షల స్త్రీనిధి, బ్యాంక్ రుణాలను స్వాహా చేసినట్లుగా తెలుస్తోంది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన సంఘం సభ్యులు నేరుగా స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమాల డొంక కదిలింది.

వెన్నాడిన 'గత' పాపం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన వారిని మహిళా సంఘాల పుస్తకాల నిర్వహణకు యానిమేటర్స్‌గా నియమించుకున్నారు. వీరి ద్వారా అక్రమార్జనకు తెరలేపారు. మహిళా సంఘాలకు రుణం మంజూరైతే యానిమేటర్ల ద్వారా భారీగా కమీషన్లు దండుకున్నారు. అంతేకాక ఒక్కో పనికి ఒక్కో ధర నిర్ణయించి మహిళా సంఘాల సభ్యులను దోచేశారు. సంఘాల్లో బోగస్ సభ్యులను సృష్టించి బ్యాంకుల ద్వారా రూ. లక్షల్లో రుణాలు తీసుకుని స్వాహా చేశారు. ఈ అక్రమాల్లో టీడీపీ ప్రజాప్రతినిధులతో పాటు యానిమేటర్లు, సీసీలకు వాటా ఉన్నట్లుగా తెలుస్తోంది. అదే పంథాను నేటికీ కొనసాగిస్తూ వచ్చారు. ఈ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

రెట్టింపు రుణం పేరుతో వంచన

ఉరవకొండలోని బాబా మహిళా సంఘం 20 ఏళ్ల క్రితం ఏర్పడింది. ఈ సంఘానికి లీడర్‌గా, యానిమేటర్‌గా టీడీపీకి చెందిన ముఖ్య కార్యకర్త వహీదా వ్యవహరిస్తోంది. అప్పట్లో ఐకేపీ కార్యాలయం మొత్తం వహీదాతో పాటు మరో నలుగురు యానిమేటర్ల కనుసన్నల్లో పనిచేసింది. గత ఏడాది డిసెంబర్ 22న బాబా సంఘానికి రూ.10 లక్షల రుణం మంజూరైంది. ఈ రుణాన్ని సంఘం సభ్యులకు పంచిన రెండు రోజుల తర్వాత ఇంత కంటే ఎక్కువ రుణం వచ్చేలా చేస్తానని వహీదా నమ్మబలికి.. సభ్యుల నుంచి మొత్తం డబ్బు వసూలు చేసుకుంది. ఆ తర్వాత డబ్బు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తూ వచ్చింది. దీంతో విసుగు చెందని సభ్యులు గత ఏడాది డిసెంబర్ 26న అనంతపురానికి వెళ్లి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మిని కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం అదే నెల 30వ తేదీ మరోసారి కలెక్టర్‌ను ప్రత్యేకంగా కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

విచారణలో వెలుగు చూసిన అక్రమాలు

కలెక్టర్ ఆదేశాలతో రంగంలో దిగిన డీఆర్‌డీఏ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఉరవకొండ మండలంలో మొత్తం 700 సంఘాలు ఉండగా, 7,800 మంది సభ్యులు ఉన్నారు. మొత్తం 19 గ్రామైక్య సంఘాలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. వీటిలో చందమామ వీఓలోని 31 సంఘాల్లో రూ.10లక్షల బ్యాంకు రుణాలు, స్త్రీనిధి సొమ్మును యానిమేటర్లు వహీదా, రషీదా స్వాహా చేసినట్లు తేలింది. గంగ గ్రామైక్య సంఘంలోనూ రూ.10లక్షల మేర సొమ్మును యానిమేటర్లు, సీసీలు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అధికారులు మరింత లోతైన విచారణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

సీసీలకు షోకాజ్

విచారణలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూడడంతో ఈ నెల 8న ముగ్గురు సీసీలకు డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారిలో మల్లేసు, చంద్ర, జైనబీ ఉన్నారు. వీరంతా గతంలో ఉరవకొండలో సీసీలుగా పనిచేసిన వారే. వీరితో పాటు యానిమేటర్లు వహీదా, రషీదా, వైష్ణవికూ నోటీసులు అందజేసినట్లు వైకేపీ ఏసీ శివయ్య తెలిపారు.

పురుగుల మందు డబ్బాతో సభ్యురాలి నిరసన

తనకు మంజూరైన రుణాన్ని డ్వాక్రా సంఘం ప్రతినిధి, యానిమేటర్ వహీదా ఇవ్వకుండా వేధిస్తున్నారని, ఎలాగైనా ఆ సొమ్మును ఇప్పించాలంటూ ఉరవకొండ వైకేపీ కార్యాలయం ఎదుట సోమవారం బాబా మహిళా సంఘం సభ్యురాలు లక్ష్మీదేవి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తమ సంఘానికి రూ.10 లక్షల రుణం మంజూరు కాగా, తన వాటా రుణం ఇవ్వకుండా సంఘం లీడర్ వహీదా వేధిస్తోందని ఆరోపించారు. తన పేరున ఉన్న రుణం మొత్తాన్ని ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ క్రిమి సంహారక మందు తాగేందుకు ప్రయత్నించింది. స్పందించిన పోలీసులు వెంటనే ఆమె చర్యను అడ్డుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు పిలుచుకెళ్లి, వైకేపీ ఏసీ శివయ్య, సీసీ చంద్రశేఖర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. దీంతో ఆమె ఆందోళనను విరమించింది.

క్లుప్తంగా

ఒకటో అదనపు జిల్లా జడ్జి కోర్టు పీపీగా లక్ష్మీనారాయణ



అనంతపురం: జిల్లా ఒకటవ అదనపు కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా వ్యవహరిస్తున్న గోపవరం లక్ష్మీనారాయణ రెడ్డిని అదే కోర్టు పీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హరినాథరెడ్డి, విద్యావతి, నాగరాజు బాబు, రాజశేఖర్ యాదవ్, నరసింహారెడ్డి, సృజన, రమణారెడ్డి, న్యాయవాదులు అభినందించారు.

మట్కా బీటర్ల అరెస్టు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గుత్తిరోడ్డు సమీపంలో మట్కా రాస్తున్న ముగ్గురు బీటర్లను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1,11,910 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. పట్టుబడిన వారిలో రామచంద్ర, రామాంజినేయులు, రాణీ నగర్ నివాసి వెంకట్రాముడు అలియాస్ కోడి ఉన్నారు.

ఖాతాదారుల సొమ్ము స్వాహాపై విచారణ


విచారణ చేస్తున్న మేలివర్స్ మణికంఠ

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: మండలంలోని గొటుకూరు బ్రాంచ్ పోస్టు మాస్టర్ పవన్‌కుమార్ అక్రమాలపై విచారణ మొదలైంది. ఖాతాదారుల పొదుపు ఖాతా నుంచి వారికి తెలియకుండా డబ్బు కాజేసిన వైనంపై 'ఖాతాదారుల సొమ్ము స్వాహా' శీర్షికన 'సాక్షి'లో సోమవారం కథనం వెలువడింది. దీనిపై స్పందించిన పోస్టల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం మేలివర్స్ మణికంఠ ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఖాతాదారులతో ఉన్న పాసుపుస్తకాలను, బ్రాంచ్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అయితే రికార్డుల్లో చెల్లింపులకు సంబంధించి పరిశీలన చేస్తుండగా సర్వర్ మొరాయించింది. దీంతో పరిశీలనను మంగళవారానికి వాయిదా వేశారు. కాగా, అక్రమాలకు పాల్పడిన బీపీఎం పవన్‌కుమార్ నేరుగా ఖాతాదారుల ఇళ్లకు వెళ్లి తాను వాడుకున్న సొమ్ములో కొంత మేర చొప్పున చెల్లించి, మిగిలిన మొత్తాన్ని ఈ నెలాఖరుకు ఇచ్చేస్తానని, తనపై ఎలాంటి ఫిర్యాదు చేయరాదని వేడుకున్నట్లు తెలిసింది.

57 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


సీజ్ చేసిన వాహనాన్ని చూపుతున్న అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 57 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. అందిన ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి ఆదేశాలతో సోమవారం అనంతపురం మండలం ఆకుతోటపల్లి వద్ద అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మినీ లారీతో మరో ఆటోను తనిఖీ చేయగా 57 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. దీంతో వాహనాలను సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు, తరలింపుదారులను అదుపులోకి తీసుకుని ఇటుకలపల్లి పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో అనంతపురంలోని లెనిన్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ డి.జయపాల్‌రెడ్డి, బియ్యం తరలింపుదారు శ్రీకాంత్, గార్లదిన్నె మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మినీ లారీ డ్రైవర్ డి.మల్లికార్జున, ఆటో యజమాని ఎస్.తరుణ్ తేజ్ ఉన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వి.వెంకటరమణ, డీసీటీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మళ్లీ దొంగలు పడ్డారు

- తొమ్మిది రోజుల వ్యవధిలోనే మరో చోరీ
- నగదుతో పాటు కారు అపహరణ


అపహరించుకెళ్లిన కారు (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గత ఏడాది డిసెంబర్ 31న అనంతపురంలోని బళ్లారి బైపాస్ వద్ద ఉన్న కారు డెకర్స్ దుకాణాల్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రి అపహరించుకెళ్లిన ఘటన మరువకముందే నగరంలో మళ్లీ దొంగలు పడ్డారు. గతంలో చోరీకి పాల్పడిన ప్రాంతంలోనే మరో దుకాణంలో చొరబడి నగదుతో పాటు ఆధునా తన కారును అపహరించుకెళ్లారు. వివరాలు... నగరంలోని తపోవనం సమీపంలో 44వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై వీల్ అలైన్‌మెంట్ దుకాణంలోకి ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ప్రవేశించారు. దుకాణం షట్టర్‌ను బలమైన రాడ్‌తో మెండి లోపలకు ప్రవేశించినట్లుగా తెలుస్తోంది. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌లు, క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.39వేలు తీసుకున్నారు. అనంతరం లాకర్‌లో దొరికిన కొన్ని కార్ల తాళాలు తీసుకుని దుకాణం వెనుక ఆవరణలోకి ప్రవేశించి ఏపీ39 ఎస్ఎం 9844 నంబర్‌గల షిఫ్ట్ డిజైర్ కారును అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని యజమాని రమేష్ గుర్తించి, సమాచారం అందించడంతో మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. సమీపంలోని పలు దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కాల్‌మనీ కేసు నమోదు చేయండి


సమస్య తీవ్రతను తెలుసుకుంటున్న ఏఎస్పీ నాగేంద్రుడు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: తీసుకున్న అప్పుకు రెట్టింపు సొమ్ము చెల్లించినా వడ్డీ వ్యాపారులు వినకుండా ఇంకా కట్టాలంటూ వేధిస్తున్నారని ఏఎస్పీ నాగేంద్రుడుకు బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఏఎస్పీని కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. అనంతపురంలోని ఓ బ్యాంక్‌లో పని చేస్తున్న దివ్యాంగుడు (అంధుడు) కుటుంబ అవసరాల నిమిత్తం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ.11 లక్షల అప్పు చేశాడు. దీనికి వడ్డీతో కలిపి రూ.22 లక్షలకు పైగా చెల్లించాడు. అయినా వడ్డీ వ్యాపారులు వేధింపులు ఆపలేదు. మరింత కట్టాలని గొడవ చేస్తూ వచ్చారు. తాము ఎస్టీలమని డబ్బు కట్టకపోతే ఎస్సీఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయిస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో దిక్కుతోచని స్థితిలో భార్యతో కలసి స్పందన కార్యక్రమంలో ఏఎస్పీని కలసి వినతి పత్రం అందజేశాడు. దీనిపై స్పందించిన ఏఎస్పీ.. వేధింపులకు గురి చేస్తున్న వడ్డీ వ్యాపారులపై కాల్‌మనీ కేసు నమోదు చేయాలని నగర డీఎస్పీకి సిఫారసు చేశారు. అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించరాదని సూచించారు. కాగా, పోలీసు స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 90 వినతులు అందాయి. ఏఎస్పీ నాగేంద్రుడుతో పాటు దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు హాజరై బాధితుల నుంచి వినతులు స్వీకరించారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని

భర్తను కోల్పోయి పుట్టెడు దుఖంలో తన ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడంటూ సమీప బంధువుపై తాడిపత్రి ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో దిశ డీఎస్పీ శ్రీనివాసులకు ఆమె ఫిర్యాదు చేసింది. భర్త చనిపోయిన తర్వాత ఆస్తులు విక్రయించేందుకు సహకరించిన సమీప బంధువు... రూ.15 లక్షలకు పైగా అప్పు తీసుకుని ఎగ్గొట్టే ప్రయత్నం చేశాడని వివరించింది. ఈ డబ్బు వస్తే తన ముగ్గురు పిల్లలపై పేరుపై డిపాజిట్ చేయాలని అనుకున్నానని, అయితే తాను డబ్బు విషయంగా గట్టిగా నిలదీయడంతో తన ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని వాపోయింది. ఎలాగైనా తనకు న్యాయం చేయాలని వేడుకుంది. స్పందించిన డీఎస్పీ శ్రీనివాసులు.. తక్షణ పరిష్కారం నిమిత్తం తాడిపత్రి పోలీసులను ఆదేశించారు. బ్లాక్ మెయిలర్‌పై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సూచించారు.

99 శాతం హామీల అమలు


డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, పార్టీ నాయకులు

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలను అధికారంలోకి రాగానే 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. ప్రజానేతగా నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కళ్యాణదుర్గంలోని వైఎస్సార్ సర్కిల్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఉషశ్రీచరణ్ హాజరయ్యారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని పథకాలను ఏపీలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఇది ఓర్వలేక ప్రతిపక్షాలు బురద చల్లి రాజకీయ లబ్ధి పొందేందుకు చూస్తున్నాయన్నారు. ప్రజా కంటకులుగా మారిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్ ఎన్ని పాదయాత్రలు, బస్సు యాత్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయంఫణి, వైస్ ఎంపీపీ కాంతమ్మ, కో ఆప్షన్ సభ్యులు అబ్జల్, మమత, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, సీనియర్ నాయకులు సుధీర్, నరేంద్రరెడ్డి, తిరుమల వెంకటేశులు, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి, కౌన్సిలర్లు సురేష్, కుర్రా రాము, లక్ష్మన్న, బిక్కిహరి, ఉమేష్, కిరీటి యాదవ్, జోసెఫ్ కిషోర్, హబీబ్, సుబ్బరాయుడు, బసిరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు సీఎం జగన్


కేక్ కట్ చేస్తున్న గిరిజమ్మ, పైలా నరసింహయ్య తదితరులు

- జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రతిపక్ష నేతగా ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలను అధికారంలోకి రాగానే నెరవేర్చి పేదల గుండె చప్పుడుగా సీఎం వైఎస్ జగన్ మారారంటూ జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి నాడు సాగించిన ప్రజాసంకల్ప పాదయాత్ర నాలుగేళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజమ్మతో పాటు నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ సంఘాల రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వక్తలు మాట్లాడుతూ... ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్న వైఎస్ జగన్... అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలతో రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబాన్ని ఆదుకున్నారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యుడు రాజారాం, మాజీ మేయర్ రాగే పరుశురాం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రిస్వామిరెడ్డి, హరిత, శోభారాణి, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర రెడ్డి, నాయకులు చామలూరు రాజగోపాల్, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, హుస్సేన్‌పీరా, నాగరాజు, నదీం, మారుతీనాయుడు, రామయ్య, వెన్నపూస రామచంద్రారెడ్డి, షేక్ జావీద్, నాగేంద్ర, గోపాల్ మోహన్, మనేరి కొండమ్మ, రాధాయాదవ్, కృష్ణవేణి, చందన శివాజీ, అంజలి పాల్గొన్నారు.

129 సెల్‌ఫోన్ల అప్పగింత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చాట్‌బాట్ సేవల ద్వారా ఇటీవల రికవరీ చేసిన 129 సెల్‌ఫోన్లను సంబంధీకులకు పోలీసులు అప్పగించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన 129 మందికి సెల్‌ఫోన్లను ఏఎస్పీ నాగేంద్రడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాట్‌బాట్ సేవలను అందుబాటులో తీసుకువచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.7.19 కోట్ల విలువైన 4,489 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు.

బాలాపురంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ దాడులు

పుట్లూరు: మండలంలోని బాలాపురం గ్రామంలో విద్యుత్ చోరీలపై సోమవారం ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మొత్తం మూడు బృందాలుగా విడిపోయి చేపట్టిన తనిఖీల్లో విద్యుత్ చౌర్యం చేస్తున్న 27 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఏఈలు చంద్రశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రెండు టిప్పర్లు ఢీ ... డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


డ్రైవర్ నాగరాజును అంబులెన్స్‌లోకి తరలిస్తున్న స్థానికులు

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై రెండు టిప్పర్లు ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలో సోమవారం ఇసుక అన్‌లోడ్ చేసిన రెండు టిప్పర్లు తిరిగి ముదిగుబ్బ మండలంలోని రాళ్ల అనంతపురం ఇసుక రీచ్‌కు బయలుదేరాయి. మార్గమధ్యంలో బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్యం వద్ద ముందు వెళుతున్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొంది. ఘటనలో వెనుక ఉన్న టిప్పర్ డ్రైవర్ నాగరాజు (బత్తలపల్లి మండలం, సూర్యచంద్రాపురం గ్రామం) వాహనంలోనే ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు నాగరాజును కాపాడేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోడంతో పోలీసులు జేసీబీని రప్పించి క్షతగాత్రుడిని వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి గురైన రెండు టిప్పర్ల యజమాని ఒక్కరే కావడంతో పోలీసు కేసు లేకుండా రాజీ చేసుకున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

ఎస్సార్ సొసైటీ సేవలు అభినందనీయం

- ఏపీ విద్యాశాఖ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కల్చరల్: ఎస్సార్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని ఏపీ విద్యాశాఖ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దూరవిద్య ద్వారా చదువు కొనసాగించేలా కృషి చేస్తుండడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్ నారాయణ, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంకర రమేష్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు రియాజుద్దీన్ అహ్మద్, పుట్లూరు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్షన్ సెంటర్‌కు స్థల పరిశీలన

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలో ప్రభుత్వం రాయితీతో అందజేసే కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి స్థలాన్ని సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డితో కలసి ఉద్యానశాఖ అధికారులు, రెడ్స్ సంస్థ నిర్వాహకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన సహాయ సంచాలకులు నరసింహారావు మాట్లాడుతూ వడ్డుపల్లిలో కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం ముందుకు వచ్చారన్నారు. ఈ కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతు సంఘాలకు 75 శాతం రాయితీతో ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చర్ మండల అధికారి రత్నాకర్, రెడ్స్ ప్రతినిధి భానూజ, రైతులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి నాడు– నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలను మార్చింది. విద్యార్థులకు విద్యకు కావాల్సిన అన్ని వసతులు కల్పించిందని పాఠశాలల అభివృద్ధిలో భాగంగా ప్రధానోపాధ్యాయులు మరో ముందడుగు వేయాలని ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలకు కావాల్సిన వస్తువులు, విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, విద్యాసామగ్రి లాంటివి ముందుగానే ఎలా తయారు చేసుకోవాలి అన్న అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబుళంపల్లిలో అల్ట్రావిజన్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, సర్పంచ్ చెన్నారెడ్డి పర్యవేక్షణలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. స్థానిక ఆర్బీకే వద్ద నిర్వహించిన ఈ వైద్యశిబిరానికి దాదాపు 200 మంది హాజరు కాగా వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి 20 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు.

కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

అనంతపురం అర్బన్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే దీక్ష చేపట్టారు. రాష్ట్ర నాయకుడు జాన్సన్‌బాబు మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, సంతోష్, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నిరసన

బీసీ సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ బీజేవైఎం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయుడు వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ, బీజేవైఎం నాయకులు శ్రీనివాసులు, నాగేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'అరసం' సమావేశం

అనంతపురం కల్చరల్: ఏపీ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం ఈనెల 10న సాయంత్రం 5 గంటలకు స్థానిక లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు అరసం సభ్యులు డాక్టర్‌నానీల నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర రెడ్డి నేతృత్వంలో ఫిబ్రవరి 11, 12, 13 తేదీలలో జరగనున్న అరసం రాష్ట్రస్థాయి సమావేశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మురళీ ఓడీ బేసెస్‌పై మదనపల్లి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. సోమవారం ఆయన రిలీవ్ చేయాలంటూ కమిషనర్ భాగ్యలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. కమిషనర్ రిలీవ్ చేస్తారో లేదో వేచి చూడాలి.





ఇరుముడి కట్టు శబరిమలైకి..

అయ్యప్ప స్వాముల ఇరుముడి ఘట్టాన్ని పురస్కరించుకుని అనంతపురం చెరువుకట్ట పరిసరాలు సోమవారం కిటకిటలాడాయి. అయ్యప్పస్వాములు, వారి కుటుంబ సభ్యులతో ఆలయం కిక్కిరిసింది. హరిహరసుతుడికి విశిష్ట పూజలు నిర్వహించిన అనంతరం గురు స్వాములు భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ముందు కార్పొరేటర్‌ను గెలిపించుకో..

- ఆ తర్వాత పవన్‌ను గెలిపించుకుందువు కానీ..
- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి మేయర్ వసీం సూచన



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: తన డివిజన్‌లో కార్పొరేటర్‌ను కూడా గెలిపించుకోలేని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి.. పవన్‌కల్యాణ్‌ను భుజాలపై మోసుకుని గెలిపిస్తానని పేర్కొనడం హాస్యాస్పదమని మేయర్ వసీం తెలిపారు. స్థానిక జెడ్పీ ఆవరణంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన సీటు కూడా గెలవని వ్యక్తి రెండు చోట్ల ఓడిపోయిన వ్యక్తిని గెలిపిస్తాడనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ముస్లిం మైనార్టీలకు రాజకీయ పదవులు దక్కితే ఓర్వలేనితనంతో ప్రభాకర్ చౌదరి రగిలిపోతున్నారని విమర్శించారు. తాను రాజకీయాల్లోకి కొత్తగా రాలేదని, తమ కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉందన్నారు. వైఎస్సార్ సీపీతోనే ముస్లింలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో 10 సీట్లను ముస్లిం మైనార్టీలకు కేటాయించడమే దీనికి నిదర్శనమన్నారు. వాటితో పాటు కోఆప్షన్, మార్కెట్‌యార్డు చైర్మన్ వంటి ఎన్నో పదవులను ముస్లింలకు కేటాయించారని, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను నియమించి ముస్లింలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి జరగలేదు కాబట్టే ప్రభాకర్ చౌదరిని ప్రజలు ఓడించారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి నగరంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ఎలాంటి చర్చకైనా తాను సిద్ధంగా ఉన్నానన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నగరాన్ని అంధకారంలోకి నెట్టి నిత్యం కొట్లాటలు, వేరు కుంపట్లతో నాశనం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్ కుమార్ రెడ్డి, ఇసాక్, కమల్‌భూషణ్, మల్లెమీద నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'ముందుచూపున్న నాయకుడు సీఎం జగన్'

అనంతపురం సప్తగిరి సర్కిల్: నిరుద్యోగులుగా ఉన్న వారు పక్కదారి పట్టకుండా ఎంతో ముందు చూపుతో వలంటీర్ వ్యవస్థను సృష్టించి సేవా తత్పరులుగా తీర్చిదిద్దిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేతు రమణ కొనియాడారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యకర్తలకు ధైర్యం ఇచ్చిన నేత సీఎం జగన్ అని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు అంతా తానొక్కడై ప్రభుత్వాన్ని నడిపితే, నేడు జగన్ అన్ని వర్గాల నాయకులను భాగస్వాముల్ని చేసి సమన్యాయం చేశారని తెలిపారు.

వార్షిక ప్రణాళిక రూపొందించాలి

కనగానపల్లి: సమగ్ర శిక్ష పథకం ద్వారా పాఠశాలల్లో చేపట్టే కార్యక్రమాలపై 2023– 24 వార్షిక ప్రణాళికను రూపొందించాలని ఎంఐఎస్ రామన్న ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో చేపట్టే వార్షిక కార్యాచరణ రూప కల్పనపై స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, హ్యాబిటేషన్‌లోని పాఠశాలల వివరాల నమోదు, స్కూల్ కాంప్లెక్స్ పరిధి, మండల స్థాయి ప్రణాళికలపై ప్రధానోపాధ్యాయులకు ట్రైనర్ మంజునాథ్‌శెట్టి అవగాహన కల్పించారు.

రక్షణ కల్పించండి

- పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌కు చెందిన సాకే హర్షవర్ధన్, శెట్టూరు మండలం యాటకల్లు గ్రామానికి బి.మహేశ్వరి కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఇద్దరూ ఇళ్ల నుంచి వెళ్లిపోయి ఈనెల 7న తిరుపతి శ్రీనివాస మంగాపురం ఆలయంలో వివాహం చేసుకున్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో ఏఎస్పీ హనుమంతును కలిసి తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఆయన ఆదేశాల మేరకు దిశ పోలీసులు ప్రేమికుల తల్లిదండ్రులను పిలిపించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో వారి ఇష్టం మేరకే నడుచుకోవాలని సూచించారు. అనంతరం ప్రేమికులిద్దరినీ మండల మెజిస్ట్రేట్, తహసీల్దార్ శ్రీధరమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఆయన ఎదుట వాంగ్మూలం తీసుకుని మహేశ్వరిని భర్త హర్షవర్ధన్ ఇంటికి పంపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ప్రేమికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రామగిరి: మండల పరిధిలోని ఎగువపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్ఐ జనార్దననాయుడు తెలిపిన వివరాల మేరకు.. పేరూరు సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను మూడు ట్రాక్టర్లతో తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో దాడి చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ల వాహనాల యజమానులు చెన్నకేశవులు, అమీర్, మణిలతో పాటు డ్రైవర్లపై కూడా కేసులు నమోదు చేశామన్నారు.

స్పందనకు 6 ఫిర్యాదులు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, డిప్యూటీ కమిషనర్ సావిత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 6 ఫిర్యాదులు వచ్చాయి. పారిశుధ్యం మెరుగుకు సంబంధించి 2, టౌన్ ప్లానింగ్–2, రెవెన్యూ 2 ఫిర్యాదులు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ సావిత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీఓ మహబూబ్‌జాన్, సూపరింటెండెంట్లు దేవశంకర్, విజయ్‌కుమార్, సంధ్య, తదితరులు హాజరయ్యారు.

జిల్లాకు వ్యవసాయశాఖ ఏడీ రాక

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు చెందిన అడిషనల్ డైరెక్టర్ ప్రమీల సోమవారం జిల్లాకు వచ్చారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జిల్లా అధికారి (డీఏవో) బి.చంద్రానాయక్‌తో పాటు ఉరవకొండ డివిజన్‌కు చెందిన ఏడీఏ, అక్కడి సిబ్బందితో సమావేశమైనట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఉరవకొండ డివిజన్ నుంచి వచ్చిన ఒక ఫిర్యాదుకు సంబంధించి అడిషనల్ డైరెక్టర్ విచారణకు వచ్చినట్లు తెలిసింది.

లాభాల 'గుమ్మడి' కొట్టేయాలి!



సంక్రాంతి వచ్చేస్తోంది. తెలుగు ప్రజలంతా చేసుకునే ఈ పండుగలో గుమ్మడికాయను ఇంటి ముందుంచి పూజలు చేయడం ఆనవాయితీ. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో గుమ్మడికాయ రూ.50 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలోనే గుమ్మడి పంట చేతికి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి, నారాయణపురం సమీప పంట పొలాల్లో గుమ్మడికాయలను ఉత్సాహంగా తొలగిస్తుండడాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్రభాకర్ చౌదరి చెప్పేవన్నీ అసత్యాలే



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చెప్పేవన్నీ అసత్యాలేనని కార్పొరేటర్ మల్లెమీద నరసింహులు, ఇసాక్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ పచ్చి అబద్ధాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ప్రభాకర్ చౌదరిపై మండిపడ్డారు. టీడీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో నాటకాలకు తెరతీశారన్నారు. నగరానికి తాగునీటిని తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిదన్నారు. తాను వినతి పత్రం అందించినందుకే నగరంలో రోడ్లు వేశారంటూ ప్రభాకర్ చౌదరి మాట్లాడడం హేయమన్నారు. ఎన్టీఆర్ మార్గ్‌ను నిర్మించామని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. నీచ రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం..మరొకరికి ప్రాణదానం



రక్తదాతలను పలకరిస్తున్న కళాశాల యాజమాన్యం

రాప్తాడు: రక్తదానం ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం అవుతుందని ఎస్వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ అన్నారు. సోమవారం మండలంలో హంపాపురం సమీపంలోని ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. కళాశాలలో 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, కళాశాల ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్ వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి. సూర్యశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమోహన్ సేవలు స్ఫూర్తిదాయకం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 20 ఏళ్ల పాటు విశిష్ట సేవలందించిన ఇంజినీరింగ్ సిబ్బంది కృష్ణమోహన్ స్వామి సేవలు స్ఫూర్తిదాయకమని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం కృష్ణమోహన్ స్వామి ఆకస్మిక మరణం పొందారు. స్థానిక రెండో రోడ్డులోని ఆయన నివాసం వద్ద భౌతికకాయానికి మేయర్ వసీం, మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి, కమిషనర్ కే భాగ్యలక్ష్మి, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. నగరపాలక సంస్థలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఎస్ఈ నాగమోహన్, ఈఈ రామమోహన్ రెడ్డి, సీసీలు ఉదయ్, శ్రీకాంత్ రెడ్డి, సూపరింటెండ్లు, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

అనంతపురం: నైతిక విలువలు పెంపొందించుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చునని అనంతపురం దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు అన్నారు. నగరంలోని మాస్టర్‌మైండ్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం డిగ్రీ విద్యార్థులు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అకడమిక్‌తో పాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే సులువుగా కొలువులు దక్కుతాయన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాస్టర్‌మైండ్స్ కళాశాల చైర్మెన్ డాక్టర్ బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అనంతపురం క్రైం: నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని ట్రెండ్స్ భవనం పక్కన చేపడుతున్న నిర్మాణాన్ని ఆమె పరిశీలించారు. గతంలో రోడ్డుకు ఆనుకుని పిల్లర్లు వేయడంతో వాటిని నగరపాలక సంస్థ సిబ్బంది జేసీబీతో తొలగించిన విషయం విదితమే. మరోసారి అటువంటి తప్పిదం చేయకూడదని ఆమె నిర్మాణదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

వైభవం.. వాసవీమాత నగరోత్సవం



ఉత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు



నగరోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీ కన్యకాపరమేశ్వరి నగరోత్సవం సోమవారం సాయంత్రం నగరంలో వైభవంగా జరిగింది. కొత్తూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు నేతృత్వంలో అమ్మవారికి అలంకార సేవలు, ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించిన పూల తేరుపై అమ్మవారిని ఉంచి స్థానిక రాజు రోడులోని ఆర్యవైశ్య విద్యార్థి వసతి గృహ ప్రాంగణం, కమలానగర్ మీదుగా పాతూరు పురవీధులలో ఊరేగించారు. ప్రాచీన కళారూపాలైన కోలాటం, వివిధ దేశతామూర్తుల వేష ధారణలు, సంకీర్తనలతో మహిళా భజన బృందాలు ముందు నడుస్తుండగా మంగళవాయిద్యాల నడుమ వివిధ ప్రాంత్రాల నుంచి విచ్చేసిన కళారూపాలతో భక్తులకు నేత్రానందం కల్గించారు. తమిళనాడు సేలం నుంచి తెప్పించిన నిలువెత్తు వాసవీమాత విగ్రహం ఆకర్షణీయంగా నిలిచింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబరం.. రంగవల్లుల సంబరం



ముగ్గులను పరిశీలిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం కల్చరల్: సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని రంగవల్లుల సంబరం అంబరమంటింది. సోమవారం స్థానిక రెండో రోడ్డులో ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామల, అనిల్‌గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలలో వందలాది మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఎమ్మెల్యే అనంత కుటుంబ సభ్యులు అనంత మాలతి, అనంత సువర్ణ, సీడబ్ల్యూసీ చైర్మన్ మేడా రామలక్ష్మి, సుజాతరెడ్డి తదితరులు న్యాయనిర్ణతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ నెల 12న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భారతి, సుభాషిణి, శ్రీదేవిరెడ్డి, శోభారాణి, అనిత, మార్కెట్‌యార్డు శోభ, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా సోమశేఖర్‌రెడ్డి, ఆసిఫ్, భాస్కర రెడ్డి, నాగేంద్ర గౌడ్, శివగౌడ్, అబ్దుల్ శామీర్ తదితరులు పాల్గొన్నారు.

- నెహ్రూ యువకేంద్రం, సాయిట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో తపోవనంలోని శివసాయి మందిరం ప్రాంగణంలో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. వందలాది మంది మహిళలు పండుగ ప్రాధాన్యతను తెలిపే రంగవల్లులతో ఆకట్టుకున్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మణారు ఉమాదేవి, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధి పద్మలత, లక్ష్మి, శ్వేత తదితరులు న్యాయనిర్ణేతలుగా పాల్గొన్నారు.

జాతీయస్థాయిలోనూ సత్తా చాటాలి



జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ ఆకాంక్షించారు. జిల్లా నుంచి జాతీయస్థాయి సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన నవనీత్, చరణ్‌జిత్, సృజన, గీతిక, చేతనలను సోమవారం ఆయన అభినందించారు. ఈ నెల 11 నుంచి 13 వరకు కేరళలోని ఎర్నాకులంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

విధుల్లోకి ఈఈ

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ ఈఈ రామ మోహన్ రెడ్డి సోమవారం విధుల్లోకి చేరారు. సోమవారం కమిషనర్ భాగ్యలక్ష్మి వద్ద ఆయన రిపోర్టు చేసుకున్నారు. ఆయన చేరికతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో జరుగుతున్న పనులతో పాటు సాధారణ, ఆర్థిక సంఘం పనులు మరింత వేగవంతం కానున్నాయని నగరపాలక సంస్థ వర్గాలు తెలిపాయి.

బైక్‌పై జింక దూకి వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: వన్నేదొడ్డి శివారులో పవర్ గ్రిడ్ సమీపంలో సోమవారం రాత్రి బైక్‌పైకి జింక దూకి పులికొండ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన పులికొండ పని నిమిత్తం వన్నేదొడ్డిలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. పని ముగించుకొని ఇంటికి వస్తుండగా ఎన్టీపీసీ వద్ద రోడ్డు దాటుతున్న జింక బైక్‌పైకి దూకింది. జింక ఒక్కసారిగా మీద పడటంతో భయపడ్డ పులికొండ బైక్ నుంచి కింద పడి స్పృహ తప్పాడు. వెనుక వస్తున్న వారు గమనించి 108 వాహనంతో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.